క్లుప్తంగా

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



మాళ మల్లేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, పూల సేవ, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజారులు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాన్ని అందజేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి కర్ణాటక, ఆంధ్రాకు చెందిన భక్తులు తరలివచ్చారు. అదేవిధంగా మాళమ్మ దేవిని ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.

16న వీరన్నగట్టు చెరువు వేలం

వెల్దుర్తి: అటవీ శాఖ పరిధిలోని స్థానిక వీరన్నగట్టు చెరువులో చేపల పెంపకం హక్కులకు ఈనెల 16న వేలం నిర్వహించనున్నట్లు కర్నూలు జిల్లా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సూర్యచంద్ర రాజు ఆదివారం తెలిపారు. వేలం కర్నూలు కలెక్టర్ ఆఫీసు వెనుక మాంటిస్సోరి స్కూల్ సమీపంలోని కర్నూలు రేంజ్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలం దక్కించుకున్న వారికి ఏడాది పాటు చేపల పెంపకం, పట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. వేలం పాట ముగిసిన వెంటనే పూర్తి పైకం, పన్నులతో సహా కలిపి చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు కర్నూలు రేంజ్ కార్యాలయంలో సంప్రదించాల్సిందిగా వెల్దుర్తి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీఓ) కాళిదాసు తెలిపారు.

నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు



అధ్వానంగా ఉన్న యాటకల్లు బీసీ కాలనీ

ఆస్పరి: మండలంలోని యాటకల్లు బీసీ కాలనీలో వీధి రోడ్లు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షం వచ్చినా వీధుల్లోని గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా యాటకల్లుకు వచ్చిన మంత్రి గుమ్మనూరు జయరాం సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలకు రూ.20 లక్షలు మంజూరు చేశారు. నిధులు మంజూరై మూడు నెలలు కావస్తున్నా అధికారులు పనులు చేపట్టడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన వీధి పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. ఈ విషయాన్ని పంచాయతీ రాజ్ ఏఈ యమునప్ప దృష్టికి తీసుకెళ్లగా స్థానిక ప్రజా ప్రతినిధులు పనులు చేయడానికి ముందుకు రావడం లేదన్నారు. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలకు రూ.20 లక్షలు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



నరసింహులు (ఫైల్)

నందవరం: మండల పరిధిలోని చిన్నకొత్తిలి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసింహులు (51) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. నరసింహులు, చిట్టెమ్మ దంపతుల కుమార్తె ఆదోని మండలంలోని ఆరేకల్లు గ్రామంలోని గురుకుల బాలిక పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఆదివారం సెలవు కావడంతో దంపతులు బైక్‌పై ఆరేకల్లులో చదువుతున్న కుమార్తె స్టెలాను చూసేందుకు వెళ్లారు. కూతురితో మాట్లాడుతుండగా నరసింహులు హఠాత్తుగా కుప్పకూలిపోయాడు. వెంటనే భార్య చిట్టెమ్మ సమీప బంధువుల సహాయంతో బైక్‌పై ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. డాక్టర్లు పరీక్షించి ఆయన అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. నరసింహులు 2004–2009 వరకు పెద్దకొత్తిల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా విధులు నిర్వహించారు. నరసింహులు ఆకాల మరణంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

మారెమ్మవ్వకు ప్రత్యేక పూజలు

ఆలూరు: మండల కేంద్రంలోని గుంతకల్లు రోడ్డులో వెలసిన మారెమ్మవ్వ ఆలయ 14వ వార్షికోత్సవం సందర్భంగా అర్చకులు గవిసిద్దయ్య స్వామి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అవ్వకు సలువ బిందెలు, ఫల, పుష్ప, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర పూజ కార్యక్రమాలు చేపట్టారు. కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, కమిటీ పెద్దలు దేవేంద్రప్ప, గోపాల్‌రెడ్డి, ఆనందరాజు, పెద్దమంగయ్య, గుత్తినాగరాజ్, అనిల్, కృష్ణ, రాము, హరి, తదితరులు ఆలయాన్ని సందర్శించిన భక్తులకు అన్న ప్రసాదాలను ఏర్పాటు చేశారు.

పల్లెల ప్రగతిబాట

- అభివృద్ధి పనులతో మారిన రూపురేఖలు
- ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుతో గ్రామంలోనే సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న నగరదోన గ్రామ సచివాలయం



నూతనంగా నిర్మించిన పెంచలపాడు - గుమ్మనూరు రోడ్డు

చిప్పగిరి: దేశానికి పట్టు కొమ్మలు పల్లెటూళ్లు అనే మాట సాకారం చేసేలా, గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగుతోంది. రాష్ట్ర ప్రజలు మునుపెన్నడూ చూడని సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ప్రభుత్వం పాలన సాగించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా నాటి పాలనకు నేటి జగనన్న పాలనకు తేడా స్పష్టంగా కనిపిస్తోందని ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాల అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచేలా అనేక కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ పాలన ప్రజలకు చేరువ చేస్తూ ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. అనేక గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించి రాకపోకలకు మార్గం సుగమం చేశారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థతో ప్రజలు ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తుండడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిప్పగిరి మండలంలో రూ.3.5 కోట్లతో నూతన గ్రామ సచివాలయాల నిర్మాణం చేపట్టగా ఇప్పటికే 4 గ్రామ సచివాలయాల భవనాలు పూర్తయ్యాయి. మిగతా వాటి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. అంతేగాకుండా రూ.1.2 కోట్లతో 9 హెల్త్ సెంటర్లు, మరో రూ.1.20 కోట్లతో 9 రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు చేపట్టగా వివిధ దశలలో భవనాల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. రోడ్డు నిర్మాణాలకు పెద్ద పీట వేస్తూ మండలంలోని వివిధ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించారు. మండలంలోని కుందన గుర్తి నుంచి రామదుర్గం వరకు రూ.11 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు గతంలో పూర్తి కాగా ఇటీవల రూ.5 కోట్లతో పెంచలపాడు – గుమ్మనూరు వరకు 8.2 కిలోమీటర్ల మేర రూ.5 కోట్లతో రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది.

ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం

గుమ్మనూరు నుంచి పెంచలపాడు వరకు 8.2 కిలోమీటర్ల మేర రూ.5 కోట్ల నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మండలంలో ప్రధాన రహదారి నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లపై ప్రభుత్వానికి నివేదిక పంపాం. అనుమతులు రాగానే రోడ్డు నిర్మాణాలు చేపడతాం.

– పీఆర్ డీఈ చౌడారెడ్డి

సౌకర్యంగా ప్రయాణం



గతంలో గుమ్మనూరు గ్రామం నుంచి చిప్పగిరి, గుంతకల్లు తదితర గ్రామాలకు వెళ్లాలంటే ప్రయాణం నరకప్రాయంగా ఉండేది. ప్రభుత్వం నూతనంగా రోడ్డు నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేయడంతో రాకపోకలకు సౌకర్యంగా మారింది. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకు కృతజ్ఞతలు.

– శ్రీధర్, గుమ్మనూరు గ్రామం

230 మందికి కౌలు కార్డులు

మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాలలో 230 మందికి కౌలు రైతు కార్డులు మంజూరు చేసినట్లు ఏఓ రవి ఆదివారం తెలిపారు. ఈ కార్డుల ద్వారా కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ పథకాలు, పరిహారం, పంటల బీమా, రైతు భరోసాతో పాటు గ్రూపుగా ఏర్పడితే రుణ సౌకర్యం కూడా కల్పించడం, వ్యవసాయ పరికరాలు కూడా ఇస్తారని వెల్లడించారు.

రూ.30 కోట్ల వ్యవసాయ రుణాలు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్‌బీఐ ఏడీబీ బ్యాంకు ద్వారా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు గాను ఏప్రిల్ నుంచి జూలై వరకు రైతులకు రూ.30 కోట్ల మేర వ్యవసాయ రుణాల మంజూరుతో పాటు రెన్యూవల్ చేసినట్లు బ్యాంకు చీఫ్ మేనేజర్ సురేంద్రకుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. బ్యాంక్ ద్వారా 600 మంది రైతులకు బంగారు నగలపై రూ.9 కోట్ల వరకు రుణాలను తక్కువ వడ్డీకి మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ ఖరీఫ్‌లో 2500 మందికిపైగా వ్యవసాయ రుణాలను గడువులోగా చెల్లించడం లేదా రెన్యూవల్ చేసుకుని, ప్రభుత్వం అందించే రాయితీలు పొందాలని సూచించారు. రుణం సకాలంలో చెల్లించేవారిని 3 శాతం వడ్డీ రాయితీ లభిస్తుందని తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గంతో జిల్లా నాయకులు


ఎమ్మిగనూరురూరల్: నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతనంగా ఎంపికైన నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓఎస్ సంఘ భవనంలో జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా జిల్లా అధ్యక్షులు మద్దిలేటి, సహాయ ఎన్నికల అధికారిగా కర్నూలు నగర అధ్యక్షుడు పుల్లయ్య వ్యవహరించారు. సభ్యులందరి ఆమోదంతో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం తాలుకా అధ్యక్షుడిగా మల్లికార్జున, సహాయ అధ్యక్షులుగా తాయన్న, కార్యదర్శిగా బడేసాబ్, కోశాధికారిగా విక్టోరియారాణి, ఉపాధ్యక్షులుగా రజని, షఫి, సంయుక్త కార్యదర్శులుగా అయ్యన్న, సయ్యద్‌షబ్బీర్‌లతో పాటు ఐదు మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి మాట్లాడుతూ.. నూతనంగా ఎంపికైన సభ్యులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఏపీఎన్జీవోఎస్ తాలుకా కార్యదర్శి వరప్రసాద్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దయ్య, ఆలూరు తాలుకా అధ్యక్షుడు రంగస్వామి, నంద్యాల అధ్యక్షుడు గోవిందు, తాలుకా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

కలవరపెడుతున్న కళ్లకలక



కళ్లజోడుతో పాఠశాలకు హాజరైన విద్యార్థులు



కళ్ల కలక చిత్రం

ఆలూరు: ప్రస్తుత సీజన్‌లో కళ్లకలక విజృంభిస్తోంది. చిన్నా పెద్దా తేడాలేకుండా అందరికీ సోకుతుండడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు కళ్ల కలక వేగంగా వ్యాపిస్తోంది. దీంతో విద్యార్థులు కళ్ల జోడు ధరించి పాఠశాలలకు హాజరవుతున్నారు. ఉపాధ్యాయులు కళ్ల కలక సోకిన వారిని సహచర విద్యార్థులకు దూరంగా కూర్చోబెట్టడం, లేదా సెలవు చీటీ రాయించుకుని ఇంటికి పంపడం చేస్తున్నారు. ప్రధానంగా వైద్య శాఖ అధికారులు ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు వర్కర్ల ద్వారా కళ్ల కలక నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.

కళ్ల కలక లక్షణాలు

- కళ్లలో నొప్పి, మంట, దురద, కళ్లు ఎర్రవిగా మారడం జరుగుతుంది.
- నిద్రించినప్పుడు కనురెప్పలు అతుక్కుపోతాయి.
- ఒక్కోసారి కళ్ల నుంచి చీము కారుతుంది.
- కంటి రెప్పలకు వాపు, ఉబ్బడం జరుగుతుంది. ఒక్కోసారి దగ్గు, జ్వరం వంటి లక్షణలు ఉంటాయి.

తీసుకోవలసిన జాగ్రత్తలు

- కళ్లను నులమడం వంటివి చేయరాదు.
- కంటి నుంచి నీరు కారుతుంటే టిష్యూ లేదా మెత్తటి వస్త్రంతో తుడుచుకోవాలి.
- కళ్లను ఎక్కువగా తాకరాదు. వ్యాధి సోకిన వారు ఇతరులకు దూరంగా ఉండాలి. కాంటాక్టు లెన్సులు వాడరాదు.
- వైద్యుల సూచన మేరకు యాంటీ బయాటిక్ డ్రాప్స్ వాడాలి. తరచూ కళ్లను నీటితో కడగడం వల్ల దరద తగ్గుతుంది.

కళ్లను శుభ్రంగా ఉంచుకోవాలి

రోజుకు రెండు, మూడు పర్యాయాలు నీటితో కళ్లను శుభ్రం చేసుకోవాలి. మెత్తటి గుడ్డతో కళ్లను తుడుచుకోవాలి. నలపడం వంటివి చేయరాదు. ప్రధానంగా కళ్ల కలక అంటు వ్యాధి. ఈ వ్యాధి లక్షణాలు ఉన్న వారు కుటుంబసభ్యులకు దూరంగా ఉండాలి. వైద్యుల సలహా మేరకు ఐ డ్రాప్స్ వాడాలి.

– డాక్టర్ లక్ష్మినారాయణ, ఆలూరు

వ్యాప్తి నియంత్రణకు చర్యలు



కళ్ల కలక అంటు వ్యాధి కావడంతో ఆ లక్షణాలున్న విద్యార్థులకు సెలవు ఇచ్చి ఇంటికి పంపుతున్నాం. మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఐడ్రాప్స్ మంజూరు చేయాలని డాక్టర్లను కోరాం. వైరస్ నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటాన్నాం.

– కోమలాదేవి, ఆలూరు ఎంఈఓ

పంట నమోదుతో ప్రయోజనం



గోనెగండ్లలో పంట నమోదు చేస్తున్న ఆర్బీకే సిబ్బంది

గోనెగండ్ల: వ్యవసాయ రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా వివిధ పథకాలను అమలు చేస్తున్నారు. రైతుకు పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం ఏటా రూ.13,500 అందిస్తుంది. అలాగే పెట్టుబడి సాయంతో పాటు ఆర్బీకేల ద్వారా రాయితీపై విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం అందిస్తోంది. పంటలు సాగుచేసిన రైతులు ఎలాంటి పరిస్థితుల్లోనూ నష్టపోకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం పంట నమోదు అవకాశం కల్పించింది. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురవడం, ఆయకట్టుకు నీటి విడుదల ఆలస్యం కావడంతో పంటల సాగు ఆలస్యమైంది. దీంతో బోర్లు, బావుల కింద రైతులు అధికంగా పంటలు సాగు చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల గానీ, వర్షాభావ పరిస్థితుల ద్వారా పంట నష్టం జరిగితే పంట నమోదు ఆధారంగా ప్రభుత్వం బాధిత రైతులకు నష్ట పరిహారం అందజేస్తుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మండలంలో బోర్లు, బావులు, ఆయకట్టు తదితర నీటి వనరుల కింద సాగుచేసిన పంటలను వ్యవసాయ అధికారులు ఇప్పటికే పంట నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వివరాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు పంపుతున్నారు. ప్రభుత్వం చేపడుతున్న పంట నమోదుతో రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయని అధికారులు తెలుపుతున్నారు. రైతులు పంటలను పంట నమోదు చేయించుకోవడం వల్ల ప్రభుత్వం అందించే ప్రతి రాయితీ సకాలంలో రైతలకు అందుతుందని చెబుతున్నారు. అలాగే రైతులకు పంట నష్టం, ఉచిత బీమా, బ్యాంకుల రుణాలు అందుతాయి.

ఖరీఫ్ సీజన్‌లో మండలంలో సాగైన పంటలు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మండలంలో సాగైన పంటల వివరాలు ఇలా ఉన్నాయి. ఆముదం–82 హెక్టార్లు, వేరుశనగ–712 హెక్టార్లు, పత్తి–8,437 హెక్టార్లు, ఉల్లి–472 హెక్టార్లు, మిరప–186 హెక్టార్లు, కందులు–182 హెక్టార్లు, కూరగాయలు–58 హెక్టార్లు చొప్పున సాగయ్యాయి. మొత్తం 10,698 హెక్టార్లలో వివిధ పంటలు సాగుచేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

పంట నమోదు తప్పనిసరి



ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటల వివరాలను రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. పంట నమోదుతో రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ప్రభుత్వం అందించే పథకాలు వర్తిస్తాయి. మండలంలో ఇప్పటికే పంట నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. ఆర్బీకే సిబ్బంది పొలాల వద్దకు వచ్చి పంట నమోదు చేస్తున్నారు. ఇందుకు రైతులు సహకరించాలి.

– హేమలత, వ్యవసాయ అధికారిణి, గోనెగండ్ల

నేడు గణపతి హోమం

వెల్దుర్తి: స్థానిక రాణితోటలోని రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 14న సోమవారం గణపతి హోమం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు ప్రశాంత్ కుమార్ తెలిపారు. 33 సూక్తములతో, 33 మంది దంపతులతో, 33 హోమ ద్రవ్యాలతో ఐశ్వర్య, ఆరోగ్య, ప్రజా శ్రేయస్సు కోసం చేపడుతున్న ఈ హోమంలో భక్తులు పాల్గొన వలసిందిగా ఆయన కోరారు.

బదిలీ సీఐకు సన్మానం

తుగ్గలి: పత్తికొండ రూరల్ సీఐగా పనిచేస్తున్న రామకృష్ణారెడ్డి అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో ఆదివారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పత్తికొండ పట్టణ సీఐ మురళీమోహన్, తుగ్గలి, జొన్నగిరి, దేవనకొండ, మద్దికెర ఎస్ఐలు మల్లికార్జున, రామాంజినేయులు, భూపాలుడు, రిజ్వాన్‌బాషా, పోలీసు సిబ్బంది ఆయన్ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో రామకృష్ణారెడ్డి అందరి మన్ననలు పొందరాని డీఎస్పీ కొనియాడారు.

నేడు బేవినహాల్‌లో ‘గడప గడపకు మన ప్రభుత్వం’

హాలహర్వి: మండలంలోని బేవినహాల్ గ్రామంలో సోమవారం ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం ఉంటుందని, కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పాల్గొంటారని ఎంపీడీఓ ఆంతోని ఆదివారం విలేకరులకు తెలిపారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. అన్నిశాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఈ–క్రాప్ నమోదు చేయించుకోండి

హాలహర్వి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను ఆర్బీకే సిబ్బందిని సంప్రదించి క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏఓ శివశంకర్ సూచించారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. పంటల నమోదు దరఖాస్తు పూర్తిచేసి పాస్‌ఫొటో, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, పొలం ఖాతా (వన్‌బీ, ఆర్ఓఆర్), ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంకు ఖాతా జిరాక్స్, ఫోన్ నంబర్‌తో ఆర్బీకే సిబ్బందిని సంప్రదించాలన్నారు. సిబ్బంది రైతు పంట పొలానికి చేరుకొని జీపీఎస్ ట్యాగింగ్ ద్వారా పొలంలో రైతును ఫొటో తీసుకుని పంట నమోదు చేస్తారన్నారు. పంటల నమోదు చేయించుకున్న రైతులకు ప్రభుత్వం నుంచి పథకాలు, రాయితీలు వర్తిస్తాయని చెప్పారు

హొళగుంద: ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటను రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ ఆనంద్ లోకదళ్ సూచించారు. ఈ–క్రాప్ నమోదు వల్ల పంటల బీమా, పంట నష్ట పరిహారానికి ఎంతో కీలకమన్నారు. అలాగే రుణాల ప్రణాళిక, వ్యవసాయ ప్రణాళిక తదితర వాటికి పంటల నమోదు తోడ్పడుతుందని ఆయన చెప్పారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపండి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ఆలూరు: స్థానికంగా నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా పనులు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన ఆదివారం మాట్లాడుతూ.. పల్లెల్లో తాగునీటి సౌకర్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీల సదుపాయం మెరుగుపరచాలన్నారు. ఈనెల 17 నుంచి సీపీఐ ఆధ్వర్యంలో విశాఖపట్టణంలో.. ‘దేశాన్ని రక్షించండి – రాష్ట్రాన్ని కాపాడండి’ అనే కార్యక్రమాన్ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు డాక్టర్ నారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గిడ్డయ్య, రాష్ట్ర సీపీఐ సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరావు తదితరులు ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూరు నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారంపై చర్చిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య తెలిపారు.

బోరు ఏర్పాటు



స్విచ్ ఆన్ చేస్తున్న పి.మురళీధర్ రెడ్డి

పత్తికొండ రూరల్: స్థానిక జర్నలిస్టు కాలనీలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్ రెడ్డి నీటి బోరు ఏర్పాటుచేశారు. గత కొన్నేళ్ల కిందట జర్నలిస్టులకు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. అయితే కాలనీలో నీటి సౌకర్యం లేక ఇంటి నిర్మాణాలు చేపట్టలేకపోయారు. విషయాన్ని మురళీధర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన జన్మదినం సందర్భంగా బోరు వేయించారు. ఒకటిన్నర ఇంచుల నీరు పండటంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సేవాదళ్ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు.

పంద్రాగస్టు వేడుకలకు సన్నాహాలు



వెల్దుర్తి బాలికల జెడ్పీ హైస్కూల్‌లో పరుగు పందెం దృశ్యం

వెల్దుర్తి: ఆగస్టు 15 స్వాతంత్య్ర దినోత్సవం పాఠశాలల్లో ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులకు ఇప్పటికే పలు రకాల పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లో వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తూ విద్యార్థులకు తర్ఫీదునిస్తున్నారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజున మువ్వన్నెల జెండా విష్కరణ, పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం, ర్యాలీలు, నాట్య ప్రదర్శనలు, ఇతరత్రా కార్యక్రమాలకు సన్నద్ధమవుతున్నారు.



ఎల్లెల్సీ ఆయకట్టు కింద వరి నారు నాటుతున్న కూలీలు



వరిసాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతన్న



వరినారు తీస్తున్న కూలీలు



వాహనంలో ఇతర ప్రాంతానికి నారు తీసుకెళ్తున్న దృశ్యం

జోరుగా వరి నాట్లు

హొళగుంద: తుంగభద్ర రిజర్వాయర్ నుంచి గత నెల 28న దిగువ కాలువ (ఎల్లెల్సీ)కి విడుదలైన నీరు డిస్ట్రిబ్యూటరీ (డీపీ) కాలువలకు సరఫరా కావడంతో హొళగుంద మండలంలోని ఆయకట్టు కింద సేద్యం పనులు ప్రారంభమయ్యాయి. ఖరీఫ్‌లో జిల్లాలో దాదాపు 43 వేల ఎకరాలకు సాగునీరందనుంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాక ముందు ఒక కారు పంటతో సరిపెట్టుకుంటున్న ఇక్కడి రైతులు గడిచిన నాలుగేళ్లుగా ఖరీఫ్, రబీలో రెండు సీజన్లలో వరి పంటను పండిస్తున్నారు. ఈ సారి కూడా రెండుకార్ల పంటను తీసుకుందామని ఆశతో వరినాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. టీబీ డ్యాంలో ఈ ఏడాది కూడా నీటి నిల్వ ఆశాజనకంగా ఉండడంతో రైతులు వరి సాగుపై దృష్టి పెట్టారు. ఇప్పటికే బోరు బావుల కింద అమ్మకానికి వేసిన వరి నారును ఇతర ప్రాంత రైతులు తీసుకెళ్లేందుకు వస్తుండడంతో డిమాండ్ పెరిగింది. స్థానిక రైతులు కూడా నారుమడులు వేసుకున్న వారికి ముందుగానే అడ్వాన్స్‌లు చెల్లించారు. ప్రస్తుతం సెంటు వరినారు రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు పలుకుతుంది.

విద్యార్థికి గాయాలు

కోసిగి: మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామంలో పొలానికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి భీమేష్‌కు గాయాలయ్యాయి. వైద్య సిబ్బంది తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మంత్రాలయానికి చెందిన సురేష్, రాజేశ్వరి దంపతుల కుమారుడు భీమేష్ కోసిగి మండలం సజ్జలగుడ్డం గ్రామంలో అవ్వతాతలు భీమక్క, మల్లయ్య వద్ద ఉంటూ జంపాపురం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బైక్‌పై పొలానికి వెళ్తుండగా అదుపు తప్పి కిందపడడంతో గాయాలయ్యాయి. విద్యార్థిని కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం 108 వాహనంలో ఈఎంటీ రామకృష్ణ, పైలట్ జగదీష్ ఆదోని ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు.

ఆదోనిలో కార్డెన్ సెర్చ్

ఆదోనిఅర్బన్: డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో ఆదివారం ఆదోని త్రీటౌన్ సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అరుంజ్యోతినగర్, కార్వన్‌పేట, కొడల్‌పేట ప్రాంతాల్లో సోదాలు చేశారు. 20 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, 20 బస్తాల పీడీఎస్ రైస్(50కేజీలు) ప్యాకెట్లు, 13 రికార్డులు సరిగా లేని మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు.